పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి షేక్‌రిజ్వాన్‌బాషా

జనగామ, మే 20 (నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగ పట్టభద్రులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు. సోమవారం వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా షేక్‌రిజ్వాన్ బాషా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు తమ ఓటు హక్కును బాధ్యతగా ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు ఎన్నికల విధులు నిర్వర్తించే పట్టభద్రుల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫార్మ్-12 ద్వారా ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవీందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

నర్మెట, మే 20: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మనం అభివృద్ధి సాధించినా సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలని వక్తలు కోరారు. భాగ్యనగర అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో శ్రీక్రోదినామ సంవత్సర (2024-25) అష్టాక్షరి సేవా సమితి సహకారంతో ముద్రించిన పంచాంగాన్ని మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత అర్చక పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు మాట్లాడారు. మనం అభ్యున్నతి సాధించినా పంచాంగల ప్రత్యేకతను ఎన్నటికీ కాదనలేమని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉప్పలగిరి ప్రసాదశర్మ, ప్రధాన సలహాదారు గంగు సచ్చిదానంద మూర్తి, ఉపాధ్యక్షులు అన్నలాపురం ప్రమోద్ కుమార్ శర్మ, జిల్లా అధికార ప్రతినిధి రంగరాజు వెంకటరమణరావు, సభ్యులు ప్రయాగ నాగభూషణశర్మ, కాచరాజు చంద్రశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ శాతం పెంచాలి

రఘునాథపల్లి, మే 20: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ శాతం పెంచాలని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ శాతం పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం సరైంది కాదన్నారు. ముందుగా బీసీల జనాభా లెక్కలు తేల్చాలని, అప్పుడే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డిలో నిర్వహించిన సభలో బీసీ డిక్లరేషన్‌పై హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ మాటకు కట్టుబడి ఉండాలని వారు కోరారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జిగా నరేశ్‌గౌడ్

నాయిని నరేశ్‌గౌడ్

జఫర్‌గఢ్, మే 20 : బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జిగా నాయిని నరేశ్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని ఉప్పుగల్లు మాజీ ఉప సర్పంచ్‌గా, బీఆర్ఎస్ యువజన నాయకుడిగా నరేశ్‌గౌడ్ అందించిన సేవలను గుర్తించి సోషల్ మీడియా ఇన్‌చార్జిగా నియమించినట్లు రాజయ్య తెలిపారు. ఈ సందర్భంగా నాయిని నరేశ్‌గౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి ఆదేశాలిచ్చిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, సహకరించిన మండల, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు ఆత్మహత్య ఘటనలో నిందితుడి అరెస్ట్

బచ్చన్నపేట, మే 20 : మండలంలోని పడమటి కేశవాపూర్‌కు చెందిన రైతు కొమ్మాట రఘుపతి ఆత్మహత్య ఘటనలో నిందితుడు కొలిపాక సుమన్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పడమటి కేశవాపూర్‌కు చెందిన రఘుపతి భూసమస్య విషయంలో కొద్ది రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు కొలిపాక సుమన్‌ను సోమవారం అరెస్ట్ చేశాడు. అతడి వద్ద నుంచి సెల్ ఫోన్, రూ.60 వేలు సీజ్ చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. సుమన్‌ను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలిస్తూ మేజిస్ట్రేట్ ఆదేశాలిచ్చారని ఆయన పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PASSPORT MISSING
I, SYEDA NOORIEN, W/o. SYED KHADER SHAREEF, Age: 51 yrs, Lost my Passport No. U401472, while travelling by Auto Rickshaw from Adalath to Subedari of Hanmakonda District. and I am unable to trace is and it is lost, If anyone see my Passport please inform R/o. H.No. 2-5-473, Subedari, Choti Masjid, Hanumakonda Dist.-506001.

LOST DOCUMENT
నా పేరు పోరండ్ల సవిత మరియు నేను ఆ రోజు 13 మే 2024, 12:15 PMన కరీమాబాద్ నుండి వరంగల్‌కు లోకల్ ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు, నేను నా ఒరిజినల్ రిజిస్టర్డ్ డాక్యుమెంటు డాక్యుమెంట్ నంబర్: 3513/2014 పొగొట్టుకున్నాను.
ఎవరైనా కనిపిస్తే, దయచేసి దిగువ చిరునామాకు అందజేయండి.
పోరండ్ల సవిత W/o. గణపతి
ఇ.నెం. 17-1-303, సుభాష్ విగ్రహం దగ్గర, కరీమాబాద్, వరంగల్. పిన్ కోడ్: 506002.
సెల్: 63007 83855.

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714

WANTED HOSPITAL STAFF
★డయాలిసిస్ టెక్నిషియన్స్, OT- టెక్నీషియన్స్, ఫార్మసీ బాయ్స్ మరియు GNM నర్సులు అనుభవం గలవారు కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2pm.
NTW-00

CHANGE OF NAME
★I, SAYED ABDUL MUQEED (Old Name), R/o. H.No. 22-6-122/3, Deshaipet, Warangal, T.S.,- 506006, have Changed my name as SYED ABDUL MUQEED (New Name).
NTW-0384

CHANGE OF NAME
★I, the undersigned MADHUMATHI AKARAPU (New Name), previously called AKARAPU MADHUMATHY (Old Name), and residing at H.No.8-11-27, R.N.T. Road, Chowrastha Warangal Telangana State, and solemnly declare.
NTW-0384

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

పాలకుర్తిలో మాట్లాడుతున్న పల్లా సుందర్‌రామిరెడ్డి

ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

- కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఓడించాలి
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపు

జఫర్‌గఢ్‌లో మాట్లాడుతున్న జయపాల్‌రెడ్డి

స్టేషన్ ఘన్‌పూర్, మే 20 : నల్లగొండ- ఖమ్మం-వరంగల్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి, బ్లాక్ మెయిలర్ చింతపండు నవీన్ అలియాస్ మల్లన్నను చిత్తుగా ఓడించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యతో ఆయన విలేకరులతో మాట్లాడారు. శాసనమండలి మేధావుల సభ అని, పట్టభద్రుల ఎమ్మెల్సీగా నిజాయితీపరుడు, ప్రజలకు సేవలందించే రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని రవిశంకర్ కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను నెరవేర్చలేదన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వాదంతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డి అని, ఎమ్మెల్సీగా భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, మాజీ సర్పంచ్ తాటికొండ సురేశ్, నాయకులు కనకం గణేశ్, రంజిత్, పొన్నం రజిత, మల్లేశం పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

పాలకుర్తి : పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మండల ఇన్‌చార్జి పల్లా సుందర్‌రామిరెడ్డి అన్నారు. సోమవారం పాలకుర్తిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం ఈనెల 23న స్థానిక బృందావన్‌గార్డెన్‌లో జరిగే పట్టభద్రుల సభను విజయవంతం చేయాలన్నారు.సమావేశానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, అభ్యర్థి రాకేశ్‌రెడ్డి హాజరవుతారని ఆయన వివరించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బ్లాక్‌మెయిలర్ మల్లన్నను అభ్యర్థిగా నిలిపిందని విమర్శించారు. నిజాయితీపరుడైన రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టభద్రులు గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మండల ప్రధాన కార్యదర్శి మాచెర్ల ఎల్లయ్య, పట్టణ కార్యదర్శి ఎడవెల్లి కృష్ణ, నాయకులు దార శంకరయ్య, గిరాగిని సమ్మయ్య, పోశాల వెంకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

జఫర్‌గఢ్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం చెప్పి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని పార్టీ మండలాధ్యక్షుడు జయపాల్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యావంతుడు, నిజాయితీగా పనిచేసే రాకేశ్‌రెడ్డికే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి నాయిని నరేశ్‌గౌడ్, గ్రామాల ఇన్‌చార్జిలు కాట కృష్ణ, మాజీ మార్కెట్ డైరెక్టర్ పెంతల రాజ్‌కుమార్, తాటికాయల వరుణ్ కుమార్, నాయకులు యార సోమిరెడ్డి, కోత్వాల కుమార్, కృష్ణమూర్తి, పులి ధనుంజయ్, సింగారపు శ్రీధర్, ఎంపీ బ్రహ్మం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

కొడకండ్ల, మే 20 : పట్టభద్రుల ఎమ్మెల్సీస్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల ఎన్నికల ఇన్‌చార్జి, పాలకుర్తి జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు సిందె రామోజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న పాలకుర్తిలో జరిగే పట్టభద్రుల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాము, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు దీకొండ వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మసురం వెంకటనారాయణ, నాయకులు బాకీ ప్రేమ్‌కుమార్, చెంచు రాజిరెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దేశగాని సతీశ్, మండల యూత్ ఉపాధ్యక్షుడు కుంచం హరీశ్ పాల్గొన్నారు.

ఈరవెన్నులో రైతులతో మాట్లాడుతున్న పరశురాములు

దేవరుప్పుల మాట్లాడుతున్న ఏఈవో సాగర్

వరికొయ్యలను తగులబెడితే తగ్గనున్న భూసారం

జిల్లా వ్యవసాయ సహాయక సంచాలకులు అజ్మీరా పరశురాములు

పాలకుర్తి/దేవరుప్పుల, మే 20: వరి కొయ్యలను తగులబెట్టకుండా సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ సహాయక సంచాలకులు అజ్మీరా పరశురాములు అన్నారు. వరికొయ్యలు కాల్చడంతో జరిగే అనర్థాలపై సోమవారం పాలకుర్తి మండలం ఈరవెన్నులో రైతులకు అవగాహన కల్పించారు. మరోవైపు దేవరుప్పులలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఏఈవో సాగర్ పలు సూచనలు చేశారు. వరి కోసిన అనంతరం దుబ్బులను కాల్చడం వల్ల కలిగే హానిని వివరించారు. భూమిలో సేంద్రియ పదార్థం ప్రధాన పోషకాలు నత్రజని పాస్పరస్ పొటాషియం వంటి పోషకాలు తగ్గి భూసారం కోల్పోతుందని పరశురాములు తెలిపారు. దీంతో ఎరువులు ఎక్కువగా వాడాల్సి వస్తుందన్నారు. దీంతో పెట్టుబడి ఖర్చు పెరుగుతుందన్నారు. పంట పొలాలను కాల్చడం వల్ల లాభదాయకమైన సూక్ష్మజీవులు చనిపోతాయని తెలిపారు. ఢిల్లీలో, హర్యానాలో పంటలను కాల్చడం వల్ల ప్రత్యక్ష హాని చూస్తూనే ఉన్నామని, పొగ మంచు వల్ల పట్టణాలు అతలాకుతలం అవుతున్నాయన్నారు. రైతులు పంటలు కోసిన అనంతరం మిగిలిన దుబ్బులను భూమిలోనే కలియ దున్నితే పంటలకు మేలు చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బీ శ్రావణి, రైతులు అనుముల కుమార్, సరిత, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం వేగవంతం

పనులను పరిశీలిస్తున్న సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ హాక్

కొడకండ్ల, మే 20 : మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 2015లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి ఎస్సారెస్పీ కాల్వకు సంబంధించిన ఖాళీస్థలం కేటాయించి నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. భవన నిర్మాణంలో భాగంగా స్లాబ్ వరకు పనులయ్యాయి. ఈ నేపథ్యంలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణానికి ఓ దాత సహాయంతోపాటు స్థానిక ఎమ్మెల్యే నిధులు సమకూర్చడంతో పనులు చేపట్టారు. సోమవారం సబ్ రిజిస్ట్రార్ సయ్యద్ అబ్దుల్ హక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ సుభాషిణి, జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారని తెలిపారు. నిధుల కొరతతో ఆగిపోయిన భవన నిర్మాణానికి ఓ దాతకుతోడు ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి నిధులు సమకూర్చడంతో పనులు వేగవంతం చేశామన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి : డీఎంహెచ్‌వో

కూనూరు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ హరిశ్‌రాజ్

జఫర్‌గఢ్, మే 20 : మెరుగైన వైద్య సేవలందించేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. సోమవారం మండలంలోని కూనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలోని ఔట్ పేషెంట్ల రిజిస్టర్, సిబ్బంది హాజరు, మందుల పంపిణీ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం హరీశ్‌రాజ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వీడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజమౌళి, వైద్య సిబ్బంది సునీత, ఉష, సుజాత పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో మహిళకు తీవ్ర గాయాలు

దేవరుప్పుల, మే 20: మండలంలోని రామరాజుపల్లిలో సోమవారం ఉపాధిహామీ పనులు చేస్తుండగా మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మహిళా కూలి వల్లాల నర్సమ్మ చేతి వేలుకు గడ్డపార తగలడంతో వేలు తెగిపోయింది. వెంటనే 108కు సమాచారం అందించగా బాధితురాలిని ఈఎంటీ రాజిరెడ్డి, పైలట్ శ్రీనివాస్ జనగామలోని ఏరియా దవాఖానకు తరలించారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

జఫర్‌గఢ్, మే 20 : మండలంలోని కోనాయిచలంలో దుక్కిటెద్దు ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధిత రైతు పిడుగు రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎప్పటిలాగే రాజ్‌కుమార్ తనకున్న రెండు ఎద్దులను వ్యవసాయ పనులు పూర్తయిన అనంతరం మేతకు విడిచాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్ ఎద్దుకు తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సుమారు రూ.60 వేల నష్టం జరిగిందని బాధిత రైతు రాజ్‌కుమార్ ఆవేదన చెందారు. ప్రభుత్వం సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు..

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ, మే 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఏసీపీ అంకిత్‌కుమార్ శంక్వార్‌తో కలిసి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ జరిగే పరీక్షలకు 11 కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. మొదటి సంవత్సరంలో జనరల్, వొకేషనల్ కలిపి మొత్తం 2384 మంది విద్యార్థులు, రెండో సంవత్సరంలో జనరల్, వొకేషనల్ కలిపి 1606 మందితో కలిపి మొత్తం 3,990 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఆయన తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అదే విధంగా ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 4 నుంచి 8 వరకు ఒక సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కాగా, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని వివరించారు. ఇందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ టీమ్‌లను నియమించాలన్నారు.

ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు

ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు అనుమతించమని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, తప్పులు దొర్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. పరీక్షలు జరిగే సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో పరీక్ష పేపర్లను తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎగ్జామ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, రబ్బర్, హాల్ టికెట్లను మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ప్రతి సెంటర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు కంపౌండ్ వాల్ లేని వాటికి బారికేడ్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఫస్ట్ ఏయిడ్ కిట్ అందుబాటులో ఉండాలని, ఏఎన్ఎం, ఆశ వర్కర్ ను నియమించాలన్నారు. మండలాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డీఐఈఓ ఆంజనేయరాజు, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, డీఈవో రాము, డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్, ఆర్టీసీ డిపో మేనేజర్ జ్యోత్స్న పాల్గొన్నారు.



ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న వేద పండితులు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

రఘునాథపల్లి, మే 20: మండలంలోని నిడిగొండలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారి ఆలయంలో సోమవారం వేద పండితులు కృష్ణమాచార్యులు, కే కల్యాణ్‌స్వామి, ఆలయ అర్చకులు కేవీజీకే ఆచార్య, వీరరాఘవాచార్యస్వామి, శ్రీనివాసాచార్యస్వామి, తోయప్పన్‌అచార్యస్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి, ఆలయ చైర్మన్ గోపాల్‌లడ్డి, మనోహర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కామారెడ్డిగూడెంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీపీ నర్సయ్య

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఏసీపీ

దేవరుప్పుల/కొడకండ్ల, మే 20: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో సోమవారం దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం, కొడకండ్లలోని పోలింగ్ కేంద్రాలను వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య పరిశీలించారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. తహసీల్దార్ హుస్సేన్ నేతృత్వంలో పోలింగ్ కేంద్రంలో వసతులు కల్పించగా, పోలీసుల శాంతిభద్రతలు పర్యవేక్షి